నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్‌: 33/11 కేవీ నాచారం అవుట్‌డోర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని పలు ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నాచారం పారిశ్రామికవాడలో విద్యుత్‌ సరఫరాను నిలిపేస్తున్నట్లు నాచారం విద్యుత్‌ ఏఈ నాగరాజు తెలిపారు. నాచారం ఐడీఏ 01,05,6,7,8,9,10, సింగచెరువు తండా, శాంతి బ్రాయిలర్స్‌, వాయిత్‌ టర్బో, శ్రీకృష్ణ ఫార్మా, ఏపీఫుడ్స్‌ ఏరియా, రహేజా అపార్ట్‌మెంట్స్‌ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని పేర్కొన్నారు.

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్‌–2 పరిధిలో మరమ్మతుల కారణంగా పలు ఫీడర్లలో ఆదివారం విద్యుత్‌ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ బాబురావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎస్‌ఎన్‌యూఆర్‌ఎం ఫీడర్‌ పరిధిలోని ఈసీనగర్‌, మింట్‌కాలనీ, మహాలక్ష్మినగర్‌ కాలనీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

కేలండర్‌ ఆవిష్కరణ



రామంతాపూర్‌ : భరత్‌నగర్‌ కమ్యూనిటీహాల్‌లో శనివారం ఓల్డ్‌ రామంతాపూర్‌ మాల సేవా సంఘం ఆధ్వర్యంలో కేలండర్‌ను ఆవిష్కరించారు. శనివారం కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకట్రావు, కక్కిరేణి చేతన హరీష్‌, మునగాల సతీష్‌ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. కులసంఘాలు తమ సామాజిక వర్గం అభివృద్ధితో పాటు ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. సంఘం ప్రధాన సలహాదారులు బండారి నరసింహారావు, సత్తయ్య, సత్యనారాయణ, ఆగమయ్య, బాబురావు, అనిల్‌, శివ, శ్రీనివాస్‌, నాగేశ్వర్‌రావు, సాయికిరణ్‌, వినోద్‌, శ్రీకాంత్‌, శ్రీధర్‌, సతీష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఎల్‌ఎఫ్‌ ఫెస్ట్‌ - 2025



ఉప్పల్‌: ఉప్పల్‌ లిటిల్‌ ఫ్లవర్‌ డిగ్రీ కళాశాలలో ఎల్‌ఎఫ్‌ ఫెస్ట్‌ – 2025ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్‌ రెవరెండ్‌ బ్రదర్‌ అరుణ్‌ప్రకాష్‌, డైరెక్టర్‌ రెవరెండ్‌ బ్రదర్‌ జాన్‌, ప్రిన్సిపాల్‌ జయంతిరెడ్డి, గౌరవరెడ్డి, ఈశ్వర్‌ తదితరులున్నారు.




మల్లికార్జుననగర్‌లో గుంతలమయంగా కాలనీలు, రోడ్లు

గుంతలు.. చింతలు

- ఏడాది గడిచినా పూర్తికాని పనులు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని మల్లికార్జునగర్‌లో రోడ్లు, బాక్స్‌ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వరద ముంపు నివారణకు బాక్స్‌ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి సుమారు 8 నెలలు కావస్తున్నా.. పనులు పూర్తి కాకపోవడంతో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో పాటు అసంపూర్ణంగా ఉన్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లో ప్రమాదాలు..

అసంపూర్తి పనులతో రాత్రి వేళల్లో పాదచారులు, వయోవృద్ధులు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారని వాపోతున్నారు. మల్లికార్జునగర్‌ రోడ్డు నెంబర్‌ 3, 7 వీధుల్లోని రోడ్డు నిర్మాణ పనులు సంగం మేర వేసి వెళ్లారని దానివల్ల తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.

పైపులైన్‌ అనుసందానం లేకపోవడంతో..

నూతనంగా వేసిన 100 డయా పైపులైన్లు వేసినప్పటికీ ఇతర డ్రైనేజీకి నూతనంగా వేసిన పైపులైన్లకు అనుసందానం చేయకపోవడంతో డ్రైనేజీ నీరు రోడ్లపై ఏరులై పారుతుందని తెలిపారు. దీనివల్ల దర్వాసన, దుర్గంధం ఏర్పడి దోమలు, ఈగలు వృద్ధి చెంది కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారని పలువురు చెబుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మల్లికార్జుననగర్‌ కాలనీలో పలు ప్రాంతాల్లో అసంపూర్ణంగా ఉన్న రోడ్లు నిర్మాణాలు, డ్రైనేజీ పనులు వేగవంతంగా పూర్తి చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి



మల్లికార్జుననగర్‌ కాలనీలో అసంపూర్ణంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు సంబంధిత అధికారులు త్వరగా పూర్తి చేయాలి. వచ్చే వర్షా కాలంలో మల్లికార్జుననగర్‌లో కొన్ని కాలనీలో వరదనీటి కారణంగా ముంపునకు గురవుతున్నాయి. నూతనంగా నిర్మించిన బాక్స్‌ డ్రైనేజీ ఇతర డ్రైనేజీ పైపులైన్లకు అనుసందానం చేయాలి.

– సిరిగిరి విజయ్‌, మల్లికార్జుననగర్‌

త్వరలో పూర్తి చేస్తాం

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తాం. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలోనే పనులు పూర్తి చేస్తాం.

– లౌక్య, డీఈ

ఘనంగా సుదర్శన యాగం

ఉప్పల్‌: గణేష్‌నగర్‌లోని స్వయంభూ సంజీవని అంజనేయస్వామి దేవాలయం 19వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం సుదర్శన యాగం నిర్వహించగా.. ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



సుదర్శన యాగంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే అభినందన..

కుషాయిగూడ: నూతనంగా ఎన్నికైన చర్లపల్లి డివిజన్‌, ఈసీనగర్‌ నూతన కార్యవర్గాన్ని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందించారు. శనివారం నూతన కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానన్నారు. ఐక్యంగా ఉండి కాలనీని అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. వెంకట్రాంరెడ్డి, మహేష్‌గౌడ్‌, ఈసీనగర్‌ అధ్యక్షుడు బూడిద శ్రావణ్‌ కుమార్‌గౌడ్‌, ఉపాధ్యక్షురాలు పద్మిని, కార్యదర్శి జగ్గరాజు, కోశాధికారి ఇందిరా, ఆనంద్‌గౌడ్‌, బిక్షపతి, సత్తిరెడ్డి తదితరులున్నారు.



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో ఈసీనగర్‌ నూతన కమిటీ

ప్రత్యేక పూజలు



అల్వాల్‌: టెంపుల్‌ అల్వాల్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి కూడైరా పూజ, 108 గంగాజల అభిషేకం, నేతితో చేసిన పాయసాన్ని స్వామి వారికి సమర్పించారు. అర్చకులు రఘుపంతులు, వంశీ, ఆలయ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరకత లక్ష్మీగణపతి దేవాలయంలో..

అల్వాల్‌: కానాజిగూడలోని మరకత శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం ఆలయ వ్యవస్థాపకులు, కార్య నిర్వాహకులు డాక్టర్‌ మోత్కూరు సత్య నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శనిత్రయోదశి రోజున నవగ్రహాలకు పూజలు చేయడం వల్ల దోషాలు తొలిగి సకల శుభాలు కలుగుతాయన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించండి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీనియర్‌ సిటిజన్స్‌

మల్లాపూర్‌: నాచారం సీనియర్‌ సిటిజన్స్‌ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం నాచారం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌కు అసోసియేషన్‌ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని వారికి కార్పొరేటర్‌ హామీ ఇచ్చారు. అనంతరం నూతన సంవత్సర కేలండర్‌, డైరీని అందజేశారు. అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి సాయిబాబా, ఉపాధ్యక్షుడు జగన్నాథ్‌, సంయుక్త కార్యదర్శి శ్రీశైలం, పోచయ్య తదితరులున్నారు.

డెకరేషన్‌ సామగ్రి తొలగించండి !



గౌతంనగర్‌: జనావాసాల మధ్య డెకరేషన్‌ సామగ్రిని తొలగించాలని అన్నపూర్ణ సొసైటీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సామగ్రి కారణంగా కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓపెన్‌ బ్యాడ్మింటన్‌ పోటీలు ప్రారంభం

ఉప్పల్‌: తెలంగాణ రాష్ట్ర ఓపెన్‌ మినీ బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌ – 2025 పోటీలు శనివారం గోవర్ధన్‌ బ్యాడ్మింటన్‌ అకాడమీలో కార్పొరేటర్‌ రజితాపరమేశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ ఎలక్షన్‌రెడ్డి, ఎస్సై మధుసూదన్‌తో కలిసి ప్రారంభించారు. కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. పట్టుదల ఉంటే గల్లీ స్థాయి నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్‌ నేతలు మురళీకృష్ణారెడ్డి, స్వాతి, బంటి బ్యాడ్మింటన్‌ కోచ్‌ గోవర్ధన్‌ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ రజిత, సీఐ ఎలక్షన్‌రెడ్డి

అలరించిన నృత్య ప్రదర్శన

ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పేరిణి శ్రీనివాస్‌ శిష్యబృందం నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది. అలరిపు, వినాయక కౌతం, అగణిత, గంగాధర, నిను మంచిన, నవగ్రహాలు, తిల్లాన బామాకలాపం, దశావతారాలు, నమోనాద, అంశాలను హిమగిరి, తన్వి, బిందు, తేజశ్రీ, అదితి, వైష్ణవి, లక్ష్మీప్రసన్న, నేత్ర ప్రదర్శించి మెప్పించారు.



ప్రదర్శనతో కళాకారులు

సంక్రాంతి సంబురం.. ఆకట్టుకున్న రంగవల్లులు

ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, పలుకాలనీల అసోసియేషన్ల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సందడి మొదలైంది. శనివారం సంక్రాంతి సందర్భంగా మహిళలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో పాల్గొని, అందమైన రంగవల్లులతో వీధులు, విద్యాలయాలను తీర్చిదిద్దారు. పోటీలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు హరిదాసు వేషధారణతో ఆకట్టుకోగా.. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గంగిరెద్దుల ఆటలు, భోగి మంటలు, గాలిపటాల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

– ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ బృందం



నాచారం అకాడమీ హైట్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో..



చెక్కును అందజేస్తున్న మేయర్‌ అజయ్‌యాదవ్‌



కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి



కాప్రా విజయ స్కూల్‌లో ఆకట్టుకున్న రంగవల్లులు



అక్షర స్కూల్‌ విద్యార్థులు



గ్లోబల్‌ ఇండియన్‌ స్కూల్‌లో భోగి మంటలు



శిశుమందిర్‌ స్కూల్‌లో మాజీ కార్పొరేటర్‌ పావని

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

బోడుప్పల్‌: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్‌ మేయర్‌ తోటకూర అజయ్‌ యాదవ్‌ అన్నారు. బోడుప్పల్‌ 4, 17 డివిజన్లలో రూ.కోటితో శనివారం అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనిచేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్‌ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌, బోడుప్పల్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్‌ పులకండ్ల హేమలతాజంగారెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేయర్‌ అజయ్‌యాదవ్‌

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త !

మల్లాపూర్‌: సంక్రాంతి పండుగకు ఊరు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని నాచారం ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌ కుమార్‌ అన్నారు. పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పలు కాలనీల్లో భద్రతపై ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. సొంతూళ్లకు వెళ్లే సమయంలో పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే సంబంధిత కాలనీల్లో గస్తీని మరింత పెంచుతామని తెలిపారు. ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు అధిక మొత్తంలో నగదును ఇంట్లో వదిలివెళ్లకుండా వాటిని బ్యాంక్‌ లాకర్‌లో దాచుకోవాలని సూచించారు. ఊరికి వెళ్లే సమయంలో పక్కింటికి వారికి తమ ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలని సూచించారు.



ప్రచార వాహనం వద్ద నాచారం సీఐ రుద్వీర్‌కుమార్‌

కుషాయిగూడ: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారు పాటించాల్సిన జాగ్రత్తలపై కుషాయిగూడ పోలీసులు అవగాహన కల్పించారు. శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ప్రచార ఆటోతో ప్రచారం చేశారు. ఇళ్ల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలో వివరించారు. ఎస్సై వెంకన్న తదితరులున్నారు.

విద్యార్థులు సాంకేతికతో పోటీపడాలి

అల్వాల్‌: అల్వాల్‌ లయోలా అకాడమీ డిగ్రీ, పీజీ కళాశాల 46వ వార్షికోత్సవ వేడుకలు శనివారం కళాశాల ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ సీఎంఏ డాక్టర్‌ గద్దం నరేష్‌రెడ్డి, గ్లోబల్‌ చీఫ్‌ హెచ్‌ఆర్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ సుజీవ్‌నాయర్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రస్తుత సాంకేతికతతో పోటీపడాల్సిన సమయం వచ్చిందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల వైస్‌ చైర్మన్‌ ఫాదర్‌ అమరరావు, కరెస్పాండెంట్‌ ఫాదర్‌ డాక్టర్‌ ఫ్రాన్సిస్‌ జేవియర్‌, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎన్‌బి.బాబు, జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఫాదర్‌ విజయ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ ఫాదర్‌ డాక్టర్‌ జోసెఫ్‌ జగదీష్‌, డాక్టర్‌ అనితామేరీ, డీన్‌ ఆఫ్‌ స్టూడెంట్‌ ఎఫైర్స్‌ ప్రొఫెసర్‌ శరత్‌చంద్ర, డాక్టర్‌ రమ, సుచిత్రనాయుడు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌ పర్యటన

కాప్రా: స్థానిక సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌ ఆదిత్యనగర్‌ కాలనీలో పర్యటించారు. శనివారం పర్యటించిన ఆయన స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కాలనీవాసులు వారి సమస్యలను కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి సాధ్యమైనంత త్వరగా నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.



స్థానికులతో కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌

శ్రీనికేతన్‌లో ఫుడ్‌ ఫెస్టివల్‌



ఫుడ్‌ ఫెస్టివల్‌ను ప్రారంభించిన నెమలి అనీల్‌కుమార్‌

కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్‌ అన్నపూర్ణ కాలనీలోని శ్రీనికేతన్‌ పాఠశాలలో ఫుడ్‌ ఫెస్టివల్‌ను నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్‌ పార్టీ గ్రేటర్‌ నాయకుడు నెమలి అనిల్‌కుమార్‌ ముఖ్య అతిథిగా హాజరై ఫెస్టివల్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంక్రాంతి పిండి వంటలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. పండుగ విశిష్టతను తెలియజేసే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్కూల్‌ కరస్పాండెంట్‌ చిక్క నర్సింహ్మా, సిబ్బంది రేణు, లావణ్య, వర్మ, మంజుల స్థానిక నేతలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణహరికృష్ణ, సంపత్‌ తదితరులున్నారు.

చర్లపల్లి టర్మినల్‌లో ప్రయాణికుల కిటకిట !



రైలుకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టర్మినల్‌ శనివారం ప్రయాణికులతో కిటకిటలాడింది. సంక్రాంతి సందర్భంగా చర్లపల్లి నుంచి పలు ప్రత్యేక రైళ్లను రైల్వే నడుపుతుండటంతో చర్లపల్లి టర్మినల్‌ ప్రయాణికులతో సందడి నెలకొంది. శనివారం చర్లపల్లి–తిరుపతి, చర్లపల్లి– నర్సాపూర్‌, చర్లపల్లి– కాకినాడ టౌన్‌ ప్రత్యేక రైళ్లతో పాటు రెగ్యులర్‌ రైళ్లు వెళ్లినట్లు టర్మినల్‌ సిబ్బంది ప్రకటించారు. ఈ ప్రత్యేక రైళ్లు ఈనెల 19 వరకు నడుస్తాయని రైల్వే అధికారులు వివరించారు.

ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా చర్యలు

కీసర: కీసరలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని సీ.ఐ వెంకటయ్య అన్నారు. శనివారం మధ్యాహ్నం కీసర చౌరస్తాలో ట్రాఫిక్‌ సమస్య తలెత్తడంతో స్వయంగా రంగంలోకి దిగిని సీ.ఐ తమ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ సమస్యను పరిష్కరించారు. పండుగ నేపథ్యంలో ట్రాఫిక్‌ సమస్య తలెత్తకుండా పోలీసులకు వాహనదారులు సహకరించాలన్నారు.

